# ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు





- అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం వద్దు
- హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య.


**దశ, రంగారెడ్డి :** జిల్లాలో ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన సమస్యలను నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గురువారం రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు కె.కిరణ్మయి, చంద్రారెడ్డి, డీసీపీ కె.నారాయణరెడ్డి తదితర అధికారులతో కలిసి ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అట్రాసిటీ కేసులు, భూ సమస్యలు, హక్కుల పరిరక్షణ తదితర అంశాలపై కమిషన్ చైర్మన్ సమీక్ష నిర్వహించారు. అంతకుముందు కార్యాలయానికి చేరుకున్న చైర్మన్‌కు అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు.

సమావేశంలో జిల్లాలో నమోదైన అట్రాసిటీ కేసుల పురోగతిని చైర్మన్ సమీక్షించారు. కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం చెల్లింపు ప్రక్రియలో ఎలాంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన భూ సమస్యలు, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చూడాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను నిబంధనల ప్రకారం పరిశీలించి పరిష్కరించాలని పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీలు, ఆవాస ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, రహదారులు, విద్యా సంస్థల పరిస్థితిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై అప్రమత్తంగా ఉండాలని, బాధితులకు తక్షణ సహాయం, న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు అందించాల్సిన నష్టపరిహారం, ఓవర్సీస్ స్కాలర్‌షిప్, కులాంతర వివాహాల ప్రోత్సాహకాల వివరాలను వెంటనే సమర్పించాలని అధికారులను ఆదేశించారు.

నివేదికల ఆధారంగా నష్టపరిహారం అందిస్తున్నామని తెలిపారు. సమావేశంలో కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, జిల్లా శంకర్, డీఎంసీ సభ్యులు విజయ్‌కుమార్, బి.రాజు, లక్పతి నాయక్, యాదగిరి, పి.నర్సిములు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామారావు, ఎస్సీ డెవలప్‌మెంట్ అధికారి పద్మావతి, ఆర్డీఓలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మణికేశ్వర నగర్‌లో గణనాథుడికి ప్రత్యేక పూజలు



**దశ, ఓయూ:** మణికేశ్వర నగర్‌లో త్రిశక్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ సీనియర్ నాయకుడు బండ చంద్రారెడ్డి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణనాథుడి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గోపాల్‌రెడ్డి, శివరాజ్, నవీన్‌కుమార్, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాచారం మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదానం



**దశ, ఓయూ:** నాచారం మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నదాన ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్యఅతిథిగా నాచారం డీఐ వరుణ్ కాంత్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు లక్ష్మణ్, శ్రీధర్, రాము, కిషోర్, కిట్టు, కృష్ణమూర్తి, నరసింహ, తరుణ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## 27న ఉచిత కంటి వైద్య శిబిరం



**దశ, చౌటుప్పల్:** చౌటుప్పల్ మున్సిపాలిటీ ప్రజల కోసం ఈ నెల 27న ఆదివారం కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. నారాయణపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటల నుంచి శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో చౌటుప్పల్‌లో కంటి పరీక్షలు చేయించుకున్న వారు, కంటి ఆపరేషన్ అవసరమైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. 50 ఏళ్లు పైబడిన వారు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌తో పాటు గతంలో వినియోగించిన మందులను వెంట తీసుకురావాలని తెలిపారు. కంటి శుక్లాల (క్యాటరాక్ట్) ఆపరేషన్ అవసరమైన వారిని గుర్తించి హైదరాబాద్‌కు తరలించి ఉచితంగా ఆపరేషన్ చేయించి తిరిగి తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలి

- ధ్రువపత్రాల జారీలో వేగం పెంచాలి
- జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్



**దశ, మునగాల:** ప్రజలకు పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందించాలని, ధ్రువపత్రాల జారీలో వేగం పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ హరి సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు, ఈ సందర్భంగా కార్యాలయ పరిసరాలను కలియతిరిగి ఆయన, తహసిల్దార్ ఛాంబర్ నందు పలు దస్త్రాలను, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ కార్యాలయ ఉద్యోగులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా భూభారతి సాదా బైనమా పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన ఎస్ఎంపేట రెవెన్యూ గ్రామాలలో పారదర్శకంగా సాదా బైనమా పెండింగ్ దస్త్రాలకు పరిష్కారం చూపించాలని ఆయన సూచించారు. అదేవిధంగా ఎస్ ఐ ఆర్( సర్ ) కార్యక్రమంలో తిరస్కరణకు గురై నోటీసులు అందుకున్న ఓటర్ల వివరాల నమోదును మరలా తిరిగి వారి నుండి పూర్తిస్థాయిలో సేకరించి, ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలన్నారు.

## బీరం హర్షవర్ధన్ రెడ్డిని పరామర్శించిన మాజీ మంత్రులు



**దశ, కొల్లాపూర్:** కొల్లాపూర్ నియోజకవర్గ మాజీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి తండ్రి బీరం లక్ష్మారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నాయకులు గురువారం సింగోటం గ్రామంలోని బీరం హర్షవర్ధన్‌రెడ్డి నివాసానికి వెళ్లి లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీరం హర్షవర్ధన్‌రెడ్డిని పరామర్శించిన నాయకులు అధైర్యపడవద్దని, ధైర్యంగా ఉండాలని సూచిస్తూ కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

## నాచారం డివిజన్‌లో అభివృద్ధి పనులపై కాంగ్రెస్ ప్రచారం..

- నాచారం డివిజన్ అధ్యక్షుడు నూతలకంటి రాజు..



**దశ, ఓయూ:** నాచారం డివిజన్‌లో రోడ్ల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ.1 కోటి 70 లక్షల 5౦ వేల నిధులు కేటాయించిందని నాచారం డివిజన్ అధ్యక్షుడు నూతలకంటి రాజు తెలిపారు. ఈ నిధులతో చేపడుతున్న రోడ్లు, సీసీ రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల వివరాలను ప్రజలకు తెలియజేసేందుకు డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు గల్లీగల్లీ తిరుగుతూ ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న రోడ్ల నిర్మాణం, సీసీ రోడ్ల అభివృద్ధి, ఇతర మౌలిక వసతుల పనుల గురించి ప్రజలకు వివరించారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నాయకులు చేస్తున్న కృషిని పలువురు ప్రశంసించారు. అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ సీనియర్ నాయకులు బంధారపు శ్రీకాంత్ గౌడ్, హెచ్.ఆర్. మోహన్, తుంగ తిరుపతి, ప్రకాష్ రెడ్డి, సంతోష్ రెడ్డి, ముదసాని రామ్ రెడ్డి, రమేష్ గౌడ్, మామిడాల రాజ్ రెడ్డి, మామిడాల సంతోష్ రెడ్డి, సునీల్ రెడ్డి, బద్రయ్య, ఫసియుద్దీన్, బంధారి రఘు, గద్ద క్రాంతి, చందు నాయక్, నరేందర్ యాదవ్, జూపల్లి రాజేష్, అబ్రహం, టీ.హెచ్. బాలరాజ్, భాను గౌడ్, మధు గౌడ్ సేవాదళ్ వెంకటేష్ , శంకర్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, ఎం.డి. జావీద్, వీఎస్టీ కాలనీ జావీద్, భారతమ్మ, లీలావతి, ఉమ, కహీం నజ్మా, లక్ష్మి, రాజశేఖర్ కుమ్మగొని శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. సీనియర్ సిటిజన్ సభ్యులు సాయిబాబా, శ్రీశైలం, యాదయ్య, యాదగిరి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వార్డు అధికారులకు సామర్థ్య పెంపు శిక్షణ



**దశ, ఓయూ:** పట్టణ పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణపై తెలంగాణలోని మున్సిపాలిటీల వార్డు అధికారులకు సామర్థ్య పెంపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిడిఎంఎ, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ (NIUM) సమన్వయంతో ఈ నెల 21 నుంచి 23 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్‌సియుఇఎస్‌లో మూడు రోజులపాటు ఈ కార్యక్రమం జరిగింది.

రాష్ట్రంలోని 40 మున్సిపాలిటీలకు చెందిన వార్డు అధికారులు శిక్షణలో పాల్గొన్నారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి డాక్టర్ టి.కె. శ్రీదేవి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ శిక్షణలో ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలు 2026, స్వచ్ఛ భారత్ మిషన్-అర్బన్ 2.0, వ్యర్థాల విభజన, సేకరణ, మార్గ ప్రణాళిక, క్షేత్రస్థాయి పర్యవేక్షణ, వ్యర్థాల శుద్ధి, వనరుల పునరుద్ధరణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మల వ్యర్థాలు, సెప్టేజ్ నిర్వహణ, పారిశుధ్య కార్మికుల భద్రత, జీపీఎస్ ఆధారిత పర్యవేక్షణ, ఎంఐఎస్, డాష్‌బోర్డ్‌ల వినియోగంపై కూడా శిక్షణ ఇచ్చారు. వార్డు స్థాయిలో పారిశుధ్య మెరుగుదల ప్రణాళికలను రూపొందించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. రాష్ట్రంలోని 132 మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో పనిచేస్తున్న వార్డు అధికారులందరికీ దశలవారీగా శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఆర్‌సియుఇఎస్ డైరెక్టర్ డాక్టర్ శ్రీ నాగేశ్, ఆర్‌డీఎంఏ జె. శ్రీనివాసరావు, ఎన్ఐయుఎం డైరెక్టర్ వి. వేణుగోపాల్ పాల్గొన్నారు.

## దివ్యాంగుల సమస్యలపై వీసీకి వినతి



**దశ, ఓయూ:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌ను తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల దివ్యాంగుల ఫోరం ప్రతినిధులు గురువారం కలిసి దివ్యాంగ విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. దివ్యాంగుల హక్కుల చట్టం-2016 (ఆర్‌పీడబ్ల్యూడీ యాక్ట్)పై విశ్వవిద్యాలయంలో ప్రత్యేక అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎన్. అశోక్ కోరారు. సాధారణ విద్యార్థులకు సైతం దివ్యాంగుల హక్కులు, చట్టపరమైన రక్షణలు, సమాన అవకాశాలపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. చట్టం ప్రకారం విశ్వవిద్యాలయంలో దివ్యాంగులకు అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పించడంతోపాటు నైపుణ్యాధారిత విద్య అందించాలని కోరారు. అర్హతకు అనుగుణంగా అన్ని కోర్సుల్లో సమాన అవకాశాలు కల్పించి, విద్యాభ్యాసంలో వివక్షకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని వీసీకి వివరించారు. దీనిపై వీసీ సానుకూలంగా స్పందిస్తూ, దివ్యాంగుల హక్కుల చట్టం-2016పై అవగాహన సదస్సు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్, రాష్ట్ర సహాయక కార్యదర్శి శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

## తార్నాకలో ఘనంగా గణేష్ మహా హారతి



**దశ ఓయూ:** తార్నాక గోకుల్‌నగర్‌లోని ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణేష్ మహా హారతి కార్యక్రమాన్ని గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండారి కార్తీక చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 100 మంది మహిళలు పాల్గొని కుంకుమార్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 15 నిమిషాల పాటు మహిళలు భక్తిగీతాలు ఆలపిస్తూ గణనాథుడికి మహా హారతి ఇచ్చి, 'జై బోలో గణేష్ మహారాజ్‌కి జై' అంటూ స్వామివారిని వేడుకున్నారు. అనంతరం గణేష్ మండప ఆవరణలో భక్తి పాటలతో మహిళా భక్తురాలు దాండియా ఆడి భక్తి ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ మహిళలు, బీజేపీ నాయకులు, మహిళా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆహార సంస్థలపై టీజీ సేఫ్ కొరడా



**దశ, హైదరాబాద్:** కోర్ అర్బన్ రీజియన్‌లో టీజీ సేఫ్ బృందాలు 15 ఆహార సంస్థల్లో తనిఖీలు నిర్వహించాయి. అపరిశుభ్రత, కలుషిత ఆహారం, బొద్దింకల బెడద, నిల్వ, లేబులింగ్ లోపాలు గుర్తించి 16 నమూనాలు సేకరించారు. 5 సంస్థలకు నోటీసులు జారీ చేయగా, 8 సంస్థల లైసెన్సుల సస్పెన్షన్‌కు చర్యలు చేపట్టారు. ప్రగతినగర్‌లో లైసెన్స్ లేకుండా నిర్వహిస్తున్న లక్కీ రెస్టారెంట్‌ను అధికారులు మూసివేశారు.

# సింగరేణి బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- ❖ వాస్తవ లాభాలను ప్రకటించి కార్మికులకు వాటా చెల్లించాలి
- ❖ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి భవన్ ఎదుట భారీ ధర్నా
- ❖ గత ఆర్థిక సంవత్సరపు వాస్తవ లాభాలను ప్రకటించాలి
- ❖ ఏరియా ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకటేశ్వర్లు డిమాండ్



**దశ, భద్రాద్రి కొత్తగూడెం:** సింగరేణి సంస్థకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సుమారు రూ.52 వేల కోట్ల భారీ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని, 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థ సాధించిన వాస్తవ లాభాలను వెంటనే ప్రకటించి కార్మికులకు దక్కాల్సిన వాటాను పంపిణీ చేయాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్లోని సింగరేణి భవన్ ఎదుట టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో కార్మికులు, నాయకులు భారీ ధర్నా నిర్వహించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిశానిర్దేశం, టీబీజీకేఎస్ గౌరవాధ్యక్షుడు కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు ఈ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఏరియా వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు.

ధర్నా సందర్భంగా నాగెల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..తెలంగాణరాష్ట్రంఏర్పడినతర్వాత కేసీఆర్ హయాంలో సింగరేణి కార్మికులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, వారి హక్కులను పరిరక్షిస్తూ సంస్థను అభివృద్ధి పథంలో నడిపించామని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సింగరేణి సంస్థను ఆర్థికంగా, పరిపాలనాపరంగా తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాల వద్ద వేల కోట్ల రూపాయల బకాయిలు పేరుకుపోవడం వల్ల సింగరేణిలో నూతన యంత్రాల కొనుగోలు, ఆధునీకరణ, భవిష్యత్ విస్తరణతో పాటు కార్మిక సంక్షేమ కార్యక్రమాలపై కూడా తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసి ఐదు నెలలు గడిచినా సంస్థ వాస్తవ లాభాలు ఎంత? కార్మికులకు దక్కాల్సిన వాటా ఎంత? అనే విషయాలను ఇప్పటివరకు ప్రకటించకపోవడం వల్ల కార్మికుల్లో గందరగోళం, అనుమానాలు నెలకొన్నాయని అన్నారు. లాభాల ప్రకటనలో పూర్తి పారదర్శకత పాటించాలని, కార్మికులకు దక్కాల్సిన వాటాను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే తెలంగాణ జెన్కో విద్యుత్ కేంద్రాలకు సింగరేణి నుంచి నాసిరకం బొగ్గు సరఫరా కావడం వల్ల 4,338 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తికి విఘాతం కలిగిందని, దీనివల్ల సుమారు రూ.2,900 కోట్ల మేర నష్టం వాటిల్లిందన్న ఇంధన శాఖ నివేదికలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

బొగ్గు నాణ్యత, సరఫరా విధానాలపై సింగరేణి, జెన్కో సంస్థలు సంయుక్తంగా వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు. ఈ అంశంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, భవిష్యత్తులో ప్రజాధనానికి నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ పరిరక్షణ, కార్మికుల హక్కుల సాధనే లక్ష్యంగా టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో పోరాటాలను కొనసాగిస్తామని నాగెల్లి వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో కార్మిక నేతలు బంగారి పవన్కుమార్, జంగం రాజ్కుమార్, మునిగేల నాగేశ్వరరావు,కమటం పరమేష్,కోటేశ్వరరావు, రాజేష్,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీలో వైభవంగా వినాయక ఉత్సవాలు

- ❖ ప్రత్యేక పూజల్లో పాల్గొన్న 'వేములపల్లి బ్రదర్స్'
- ❖ ఘనంగా మహా అన్నదానం
- ❖ స్వామివారిని దర్శించుకున్న భక్తులు



**దశ, అశ్వాపురం:** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో యూత్ ఆధ్వర్యంలో కొలువుదీరిన వినాయక నవరాత్రి ఉత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం గణనాథుడికి వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ విశేష పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరైన వేములపల్లి బ్రదర్స్ వేములపల్లి కృష్ణార్జున రావు, వేములపల్లి రమేష్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ప్రత్యేక పూజల అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన మహా అన్నదాన కార్యక్రమాన్ని వేములపల్లి బ్రదర్స్ తమ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విఘ్నాలను హరించే వినాయకుని కృపాకటాక్షాలతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కాలనీ యువత ఐక్యమత్యంతో ఇలాంటి ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అన్నదాన కార్యక్రమంలో పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, కాలనీవాసులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రసాదాలు స్వీకరించారు. విచ్చేసిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు పకడ్బందీ ఏర్పాట్లు చేయడంతో కాలనీలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు, యువకులు, భక్తులు పాల్గొన్నారు.



# వైభవంగా గణనాధుని నిమజ్జనం

**దశ, మంగపేట:** వినాయక చవితి సందర్భంగా మండలంలోని అకినేపల్లి మల్లారం గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గత పది రోజులుగా భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న గణనాథుని గురువారం భక్తులు పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. అకినేపల్లి మల్లారంలో కూడా బుధవారమే వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా బుధవారం గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందడంతో గురువారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. వినాయక నిమజ్జనాన్ని పురస్కరించుకుని మండప వ్యవస్థాపకులు, అకినేపల్లి మల్లారం గ్రామ మాజీ సర్పంచ్ వత్సవాయి శ్రీధరవర్మ , ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శోభా యాత్ర నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య యువతీ, యువకులు, చిన్నారులు, మహిళలు చేసిన డ్యాన్సులు చూపరులను ఆకట్టుకున్నాయి. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని గణనాధుడికి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మండప వ్యవస్థాపకులు, అకినేపల్లి మల్లారం గ్రామ మాజీ సర్పంచ్ వత్సవాయి శ్రీధరవర్మ, ఉత్సవ కమిటీ సభ్యులు వత్సవాయి వశిష్ట ఆజాద్, చిట్టూరి రవిచంద్, అప్పినబోయిన మనోజ్, దూలగొండ పవన్ కళ్యాణ్, చెట్టుపల్లి వంశీ, చెట్టుపల్లి నీరజ్, చెట్టుపల్లి నవదీప్, రూప వెంకట్, కాంతి సాయి కుమార్, చెట్టుపల్లి భరత్, సెగ్గం నవీన్, ఎస్.కె. రఫీ, అప్పినబోయిన బన్నుతదితరులతో పాటు అకినేపల్లి మల్లారం, అకినేపల్లి మల్లారం ఎస్టీ కాలనీ , టి.కొత్తగూడెం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# తురక కాశ కార్మికులకు జనరేటర్లు అందించాలి



- ❖ ఎమ్మెల్యే పాయంకు వినతి!
- ❖ అర్హులైన వారికే కేటాయించేలా చూడాలి
- ❖ తురక కాశ సంక్షేమ సంఘం విజ్ఞప్తి

**దశ, మణుగూరు:** జిల్లాలో తురక కాశ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన జనరేటర్లను ఎలాంటి అవకతవకలు లేకుండా కేవలం అర్హులైన నిజమైన కార్మికులకే పంపిణీ చేయాలని తురక కాశ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. గురువారం మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును సంఘం ప్రతినిధి బృందం మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించింది.

ఈ సందర్భంగా సంఘం నాయకులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికుల జీవనోపాధిని మెరుగుపరిచేందుకు అందించే జనరేటర్ల ఎంపిక ప్రక్రియలో అర్హులైన పలువురు కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం జరుగుతున్న కేటాయింపులపై తమకు పలు అభ్యంతరాలు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జాబితాను పునఃపరిశీలించి, సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. అర్హులైన అసలైన తురక కాశ కార్మికులకే ఈ పథకం ప్రయోజనాలు దక్కేలా సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను అభ్యర్థించారు. నాయకుల విజ్ఞప్తిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాలు దళారుల ప్రమేయం లేకుండా, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పూర్తి పారదర్శకంగా అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ విషయంలో సంబంధిత అధికారులతో మాట్లాడి అర్హులకు న్యాయం జరిగేలా చూస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తురక కాశ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ బికారి, బూర్గంపాడు మండల అధ్యక్షుడు షేక్ అజీజ్, అశ్వాపురం మండల అధ్యక్షుడు షేక్ ఖలీల్, జనరల్ సెక్రటరీ షేక్ మదర్ వలి, అంజనాపురం గ్రామ అధ్యక్షుడు షేక్ ఖాసిం, నాయకుడు రాజమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షా కాలంలో అంగన్వాడీ టీచర్లు అప్రమత్తంగా ఉండాలి

- ❖ పిల్లల ఆరోగ్యం, భద్రత పట్ల జాగ్రత్తలు తప్పనిసరి
- ❖ కామేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ కె.ఉమ



**దశ, కామేపల్లి:** వర్షాకాలంలో అంగన్వాడీ కేంద్రాలలోని చిన్న పిల్లల ఆరోగ్యం,భద్రత పట్ల అంగన్వాడీ టీచర్లు,హెల్పర్లు చాలా అప్రమత్తంగా ఉండాలని కామేపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ కె.ఉమ అన్నారు. గురువారం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిడిపివో ఉమ మాట్లాడుతూ.. ఈ కాలంలో నీటి ద్వారా, దోమల ద్వారా వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ కాబట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అని సూచించారు.చిన్నారుల భద్రతకు పట్ల అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని,నీరు నిలిచిన,ప్రమాదకర ప్రాంతాలకు పిల్లలను వెళ్లనివ్వకూడదని సూచించారు.శిథిలావస్థలో ఉన్న భవనములో మరియు పెచ్చులూడి పడేలా ఉన్న భవనం ఉంటే తొందరగా మార్చాలని తెలిపారు. పిల్లలకు శుభ్రమైన,సురక్షిత మైన తాగునీరు మాత్రమే అందించాలన్నారు.

అంగన్వాడీ కేంద్రం,వంటగది,మరుగుదొడ్డి మరియు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి నీరు నిల్వ కాకుండా చూడాలని తెలిపారు. తడిసిన విద్యుత్ వైర్లు, స్విచ్లను తాకకూడదని, విద్యుత్ లీకేజీ ఉంటే వెంటనే సరఫరా నిలిపి సంబంధిత సెక్టార్ సూపర్వైజర్ కు వెంటనే సమాచారం తెలియజేయాలన్నారు. పాములు, తేళ్లు, కీటకాలు రాకుండా పొదలు, చెత్త, రాళ్లు, పాత సామగ్రిని తొలగించాలని సూచించారు.పైకప్పు, గోడలు, సీలింగ్, నేల, తలుపులు, కిటికీలు సురక్షితంగా ఉన్నాయో లేదో ప్రతిరోజూ పరిశీలించాలని, ఒక వేళ భవన నిర్మాణము బాగాలేని పరిస్థితి ఉంటే వెంటనే సురక్షిత ప్రాంతానికి మార్చాలన్నారు. ఆహార పదార్థాలను తేమ,పురుగులు రాకుండా సురక్షితంగా నిల్వ చేయాలని పేర్కొన్నారు. పిల్లల్లో జ్వరం,విరేచనాలు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తల్లిదండ్రులకు వెంటనే సమాచారం ఇచ్చి అవసరమైతే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రానికి తరలించాలని అన్నారు.ప్రమాదకర పరిస్థితి ఉంటే పిల్లలను వెంటనే సురక్షిత ప్రదేశానికి తరలించి సిడిపిఓ,సూపర్వైజర్ లకు తక్షణమే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే గుర్తించి నివారించడం ముఖ్యం అని తెలిపారు.

# మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పరిశీలన

- ❖ సాగునీటి రంగానికి కేసీఆర్ పెద్దపీట
- ❖ రేగా కాంతారావు కృషికి నిదర్శనం మారెళ్లపాడు లిఫ్ట్
- ❖ బీఆర్ఎస్ నాయకులు



**దశ, అశ్వాపురం:** రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం సాగునీటి రంగానికి అత్యంత ప్రాధాన్యతనిచ్చి ఏజెన్సీ ప్రాంతాలను సస్యశ్యామలం చేసిందని, మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం మాజీ ప్రభుత్వ విప్, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అవిరళ కృషికి సజీవ నిదర్శనమని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండల పరిధిలోని మారెళ్లపాడులో ఇటీవల ప్రారంభమైన ఎత్తిపోతల పథకాన్ని గురువారం బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి, మాజీ ఎంపీపీ కొల్లు మల్లారెడ్డి, సీనియర్ నాయకులు జాలే రామకృష్ణారెడ్డి, గొర్రెముచ్చు వెంకట రమణ సందర్శించారు.

ఈ సందర్భంగా ప్రాజెక్టు ద్వారా తుమ్మలచెరువు పరిసర ప్రాంతాలకు అందుతున్న సాగునీటి ప్రయోజనాలు, పంపింగ్ వ్యవస్థను వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ రంగాన్ని అగ్రభాగాన నిలిపారని గుర్తుచేశారు. కాళేశ్వరం, సీతారామ వంటి బృహత్తర ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సాగునీటి కొరతను తీర్చారన్నారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగానే ఏజెన్సీ ప్రాంత రైతాంగానికి మేలు చేసేలా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకాన్ని అనుసంధానించారని తెలిపారు. ఈ ప్రాంత రైతుల సాగునీటి ఇబ్బందులను గుర్తించిన మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి, ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించారని కొనియాడారు.

ఆయన చేసిన కృషి ఫలితంగానే నేడు ప్రాజెక్టు పూర్తయి రైతులకు అందుబాటులోకి వచ్చిందన్నారు. మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం కావడంతో తుమ్మలచెరువుతో పాటు పరిసర గ్రామాల రైతులకు పూర్తిస్థాయిలో సాగునీటి భరోసా లభించిందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో వర్షాభావ పరిస్థితులతో అల్లాడిన ఈ ప్రాంతాల్లో నేడు పుష్కలంగా సాగునీరు అందుతుండటంతో వ్యవసాయానికి మరింత ఊతం లభిస్తుందని వారు పేర్కొన్నారు. రైతుల కళ్లల్లో ఆనందం చూడటమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యంగా పనిచేసిందని స్పష్టం చేశారు.



# షార్ట్ సర్క్యూట్తో ఇంట్లో అగ్నిప్రమాదం

- ❖ పరిశీలించిన ఎమ్మార్వో శ్రీనివాసులు
- ❖ ఎంపీడీవో సూర్ణ ఆదర్శ్ గౌడ్
- ❖ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థుల విజ్ఞప్తి



**దశ, చిన్నంబావి:** చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మిపల్లి గ్రామానికి చెందిన సంపంగి ఈశ్వర్ ఇంట్లో పిడుగుపాటుతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి అగ్నిప్రమాదం సంభవించింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సమయంలో విద్యుత్ వైర్లలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ ఇటిక్యాల కృష్ణప్రసాద్ యాదవ్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం చిన్నంబావి మండల ఎంపీడీవో, తహసీల్దార్కు సమాచారం అందించి, పిడుగుపాటుతో దెబ్బతిన్న సంపంగి ఈశ్వర్ ఇంటిని పరిశీలించారు.

షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇంట్లోని విద్యుత్ పరికరాలు, నిత్యావసర సామగ్రి దెబ్బతిన్నాయి. అలాగే ఇంటి గోడలు, పైకప్పు కొంతమేర దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. ఇంట్లోని విలువైన ఎలక్ట్రానిక్ పరికరాలు, ఇతర సామగ్రి కాలిపోవడంతో బాధిత కుటుంబానికి భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అదృష్టవశాత్తూ ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అయితే ఇంట్లోని సామగ్రి, ఇతర ఆస్తులు దెబ్బతినడంతో లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత కుటుంబం తెలిపింది. పిడుగుపాటుతో ప్రాణనష్టం తప్పినప్పటికీ భారీగా ఆస్తి నష్టం జరగడంతో సంపంగి ఈశ్వర్ కుటుంబం తీవ్రంగా నష్టపోయిందని గ్రామస్థులు తెలిపారు. సంబంధిత ప్రభుత్వ అధికారులు ఇంటిని పూర్తిస్థాయిలో పరిశీలించి, నష్టాన్ని అంచనా వేసి బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి తగిన ఆర్థిక సహాయం అందించాలని వారు కోరారు.

# బొగ్గు సరఫరాలో నిర్లక్ష్యంతో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం



**దశ, బెల్లంపల్లి:** బొగ్గు సరఫరాలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం వల్ల జైపూర్ థర్మల్ పవర్ ప్లాంట్లో విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలుగుతోందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. రైతులకు నిరంతర విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రెండు పంటలకు సాగునీటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆధ్వర్యంలో గురువారం జైపూర్ ఎస్టీపీపీ వద్ద నిర్వహించిన ధర్నాలో చిన్నయ్య మాట్లాడారు. గతంలో హయాంలో 1,200 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం బొగ్గు సరఫరాలో జాప్యం కారణంగా విద్యుత్ ఉత్పత్తిపై ప్రభావం పడుతోందని ఆరోపించారు. సాగు సమయంలో రైతులకు విద్యుత్ కొరత లేకుండా చూడాలని, పంటలు ఎండిపోకుండా తక్షణమే సాగునీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల సమస్యల పరిష్కారంలో జాప్యం చేయకుండా స్పష్టమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధర్నాలో ఎమ్మెల్యేలు కోవా లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.